# మానవుడి విజయం

మిట్టమధ్యాహ్నం గదిలో పడుకుని ఏదో పుస్తకం చదువుకుంటున్నాను. మొదట వీధి తలుపు తెరిచిన సవ్వడి. వెను వెంటనే గొంతు సవరించుకున్న శబ్దమూ వినిపించాయి. ఆ సకిలింపు నాకు బాగా గుర్తు! వచ్చేడి వాడు ఆదిశేషయ్య!

"ఏం శేషయ్య మామా! రా కూర్చో! ఈ మధ్య మన కార్యకలాపాలు బొత్తిగా స్తంభించిపోయినట్టున్నాయి! ఏం చేస్తున్నావు? లేదా ఏం చేయదలచుకుంటున్నావు?" అంటూ పరామర్శించాను.

"ఏమీ చేయడంలేదు. ఊరికే గోళ్ళు గిల్లుకుంటూ యింటిదగ్గర పడివున్నాను." చాపపైన కూర్చుని గోడకు చేరగిలబడిపోతూ అన్నాడు ఆదిశేషయ్య.

ధర తగ్గుట హెచ్చుటకొరకే అన్న వాదాన్ని బట్టి చూస్తే ఏమీ చేయకపోవడం ఏదైనా చేయడానికే! పొర విడువపోతున్న పాములా నిద్రముఖంలో జోగుతూ ఆలోచనలన్నింటినీ అంతర్ముఖంగా సారించి ఈయన ఆ చేయబోతున్న పనికి బ్రహ్మాండమైన పునాదులే వేస్తున్నట్టున్నాడు. పోగా గోళ్ళు గిల్లుకుంటున్నట్టు గూడా చెబుతున్నాడనుకోండి! ఆ మాట నిజమే! గోళ్ళుగిల్లుతూ కూర్చుంటేగానీ ఈ మనిషికి వూళ్ళు ముంచే ఉపాయాలు స్ఫురించవు!

మూసి ముల్లు గొట్టుకపోయిన ఆకాశంలా ఐదు నిమిషాలు కదలకుండా మెదలకుండా కూర్చున్న తర్వాత వున్నట్టుండి నోరుతెరచి "ఒరే బాబూ! ఓ కాగితం చేతికి తీసుకో" అన్నాడు ఆదిశేషయ్య.

తెల్లబోతూ ఆయన ముఖంలోకి చూచాను. కొంపదీసి ఈయన ఆశు కవిత్వం చెప్పడుగదా! కాళికాదేవి ప్రసన్నురాలై నాలుకపైన బీజాక్షరాలైనా వ్రాసివుండాలి. కాక ఏ యతీంద్రుడైనా దయదలిచి తారకమంత్రమైనా వుపదేశించి వుండాలి. లేకుంటే అంతపని జరగదు. ఒకవేళ ప్రోనోటేమో! ఊహు, అయివుండదు. ఆదిశేషయ్య ప్రోనోటు కుంకం కట్టుకోవడానికి తప్పితే మరెందుకూ పనికిరాదని ఈ ప్రాంతంలో అందరికీ తెలుసు!

తినబోతూ రుచులడగడ మెందుకని పెట్టె తెరిచి కాగితం పైకి తీశాను.

"మొన్న మన వూళ్ళో హరికథ జరిగింది గదూ! కథ ప్రారంభంలో హరిదాసు మంచి మంచి పసందైన మాటలు కొన్ని చెప్పాడు. వాటి నలాగే కాగితం పైకి దించాలి..."

అర్థంకాక మరికొంత వివరణ కోరుతూ ఆయనవైపు చూడసాగాను.

"అంటే, ఈ ప్రపంచకం అంతా వట్టి మాయ! సంసారమంటే అదొక వూబి! ఎందరు రాజులు రాజ్యా లేలలేదు? వాళ్ళేం మూట గట్టుకపోయారు? పోయేనాడు పూచిక పుల్లయినా వెంటవస్తుందేమన్నానా? కాబట్టి దీపమున్నప్పుడే యిల్లు దిద్దుకోడం మంచిది... అలా అలా వ్రాసుకుంటూ వెళ్ళు మరి! ముఖ్యమైన విషయం తరువాత చెబుతాను..."

ఐతే యిది ఉపోద్ఘాతమన్నమాట! ఇంతకూ అసలు విషయమేమిటో?

ముఖకవళికలను బట్టి యింగితాన్ని తెలుసుకోవచ్చుననే మనస్తత్వ శాస్త్రజ్ఞుల ధీమాపాలిటికి ఆదిశేషయ్య ముఖం ఒక వెక్కిరింపు. మనిషి బక్కపలచగా వుంటాడు.

తల బట్టగట్టిపోయి యిత్తడి సిబ్బెలా వుంటుంది. బలంగా గాలివీస్తే వరుసగా అయిదు పల్లటీలు వేస్తాడేమో ననిపిస్తుంది. కాని అతడి ముఖం మాత్రం ఉక్కుకోట. ఆ కోట గోడలలోపల ఎలాటి సన్నాహం జరుగుతోందో, ఎంతటి సంరంభం చెలరేగుతోందో వూహించడం కష్టం!

తనంతటతానై తన వుద్దేశమేమిటో బయట పెట్టేదాకా నేనతడి పథకమేమిటో తెలుసుకోలేక పోయాను.

అసలు సంగ తేమిటంటే ధర్మవరం నుంచి రాయలపేటకు వెళ్ళే రోడ్డులోనట, పన్నెండో మైలురాతి దగ్గిర గ్రుక్కెడు మంచినీళ్ళు దొరకక బాటసారులు తల్లడిల్లి పోతున్నారట! అందుకు తోడూ ఆ ప్రాంతంలో తల చాటుకొక చెట్టయినా కనిపించదట! అక్కడ చేదబావి ఒకటి త్రవ్వి ఓ సత్రాన్ని నిర్మించాలని ఆదిశేషయ్య వుద్దేశం. అందుకోసం ఉదారహృదయులైన సజ్జనులు విరివిగా చందాలు విరాళాలు యిచ్చి తోడ్పడవలసిందిగా అభ్యర్థించడం ఈ విజ్ఞప్తిలోని సారాంశం!

ఉన్న సంతానం పున్నామనరకంనుంచీ వుద్ధరించగా, సప్త సంతానాల్లో ఒకటైన సత్రప్రతిష్ఠ ఆదిశేషయ్యకు స్వర్గంలో శాశ్వతస్థానం ఏర్పరచవచ్చు! కానీ నా సందేహం వేరు. ఈయనగారికి ధర్మవరం, రాయలపేట బాటసారుల పైన వున్నట్టుండి ఎందుకిలా అనుతాపం కలిగినట్టు? నీతిచంద్రికలో ఓ దీర్ఘదర్శి చెప్పినట్టు – నూకలు నిర్హేతుకంగా చల్లబడవుగదా!

# 2

ఆదిశేషయ్య అదొకరకం మనిషి. అతనికి ఎంతోకొంత భూవసతి కద్దు. కాని చెమటోడ్చి పైరెక్కించి ఆ ఫలసాయంపైన ఆధారపడి జీవించడం అతడికెందుకో వట్టి నామోషీపనిగా తోచింది. నాకు బుద్ధి తెలిసినప్పటి నుంచీ అతడు చేస్తున్నపని ఒక్కటే ఒక్కటి – అర్థసముపార్జనకు అడ్డదోవలు అన్వేషించడం!

ఆదిశేషయ్య తనకంటూ ప్రత్యేకంగా ఓ లోకాన్ని ఏర్పరచుకున్నాడు. బుద్ధిగా సేద్యం చేసుకుంటూ గుట్టుగా హితబోధ చేసినవాళ్ళను, యిది నీకు బుద్ధిగాదని గట్టిగా గడ్డిపెట్టిన వాళ్ళను ఆ లోకంనుంచీ బహిష్కరించాడు. పెదవి కదపడానికి సాహసంలేక, అతడి నడవడిపట్ల వైముఖ్యాన్ని మనసులోనే దాచుకున్న నాలాంటి వాళ్ళను అప్పుడప్పుడూ తన లోకంలోకి రానిచ్చినా అప్పటికప్పుడే వెళ్ళగొడ్తూ వచ్చాడు. ముప్పాతికా మువ్వీసంవంతు జనాభా ఈ విధంగా బహిష్కరింపబడగా అతడి లోకంలో – జాతకంలో శుక్రమహర్దశ తొంగి చూస్తున్నదని నమ్మబలికే జ్యోతిష్కులు, యినుముపైన ఏవో తంత్రాలు జరిపి బంగారంగా మార్చడం సాధ్యమేనని గొప్పలు చెప్పుకునే బైరాగులు, భూమిలోని పాతరలను యిట్టే పెకలించగలమని కోతలు కోసే మాంత్రికులు, యిలాంటివాళ్ళు కొందరు మాత్రమే మిగిలారు!

గిరి గీసుకుని కూర్చున్న ఆ చిన్నలోకంనుంచీ ఆదిశేషయ్య మిగిలిన ప్రపంచాన్ని అదిలించాలనీ బెదిరించాలనీ ప్రయత్నించాడు. అందుకోసం, వున్నారా, అసలు లేరా అని మనం శంకించే క్షుద్రదేవతల్ని ఉపాసించాడు. రాయి రాయి కరిగే అర్థరాత్రివేళ శ్మశానాలవెంబడి తిరిగాడు. మంచుసోనలు కొండలు కొండలుగా దూకే పందు చలికాలపు

రాత్రుల్లో గొంతుకుదాకా పచ్చి మంచి నీటిలో మునిగి మంత్రాలు జపించాడు. నాకు తెలిసినంతలో ఆ తిరుగుళ్ళు మోకాటి నొప్పుల్ని, నానుళ్ళు జలుబుల్నీ జ్వరాల్నీ ప్రసాదించాయి. మనిషి 'తీన్‌తేరా' పట్టిపోయాడు. లేదంటే మంత్ర తంత్రాలపట్ల నమ్మకమున్నవాళ్ళు అతణ్ణి ఒక అపాయకరమైన వ్యక్తిగా గుర్తించి, సంఘ బాహ్యుడి క్రింద లెక్కగట్టేశారు.

తన క్షుద్రదేవతల మూలబలాన్ని నమ్ముకుని ఆదిశేషయ్య ఒకసారి పెంకుటింటి పోతరాజును జగడానికి రాదీశాడు. ఈ పోతరాజాభిధానుడు తిండికి తిమ్మరాజవునో కాదోగానీ, పనికిమాత్రం పోతరాజు కాడు! ఆ పని తిట్టడానికీ, కొట్టటానికి సంబంధించినదైతే మరీ మంచిది! అతడు నడివీధిలో ఆదిశేషయ్యకు ఛెళ్ళు ఛెళ్ళున చెంప శుద్ధిచేసి 'ఒళ్ళు జాగ్రత్త' అని హెచ్చరించి తన దారిని తానుబోయాడు. ఆదిశేషయ్య మీసం మెలివేశాడు. జబ్బ చరిచాడు. 'ఈ భూమిమీద నూకలు లేవు పొ'మ్మని పంతం పట్టాడు.

రోజులు గడిచిపోతున్నాయి. పోతరాజు మాత్రం పోతపోసిన విగ్రహంలా వుండిపోతూ వచ్చాడు. కొందరు సంశయాత్ములు 'ఆదివారం అమాస' రావాలి గదా అనుకున్నారు. ఆ ఆదివారం అమావాస్యగూడా రానూ వచ్చింది, పోనూ పోయింది. పోతరాజు చెక్కు చెదరలేదు!

ఇతరుల సంగతలా వుండగా అంతటితో ఆదిశేషయ్యకే తన మంత్రశక్తి పట్ల నమ్మకం సడలిపోయింది!

అప్పుడనుకున్నాడు - మంత్రాలూ లేవు, మట్టీలేదు. ఉన్నా మంత్రాలకు మామిడికాయలు రాలవు. మామిడికాయలు రాల్చగలిగేదీ, మనుషులను తోలుబొమ్మలను చేసి ఆడించేదీ, కొండమీది కోతిని క్రిందికి తీసుకొచ్చేది డబ్బు! లోకం ఒక పాలిచ్చే బర్రెలాంటిదైతే డబ్బే దానికి పగ్గం! ఈ పగ్గంతో ఆ బర్రెను ఇంటిముంగిట కట్టి పదేయవచ్చు!

ఈ రహస్యం ఆకళింపుకు రాగానే ఆదిశేషయ్య ఆకొన్న వ్యాఘ్రంలా లోకంపై కెగబడ్డాడు. కొంతకాలం పాటు బోనులో నిలబడి ఒకరు చెప్పమన్నట్టు సాక్ష్యం చెప్పడం అతడికొక వృత్తిగా పరిణమించింది. కాని ఏమాట కామాటే చెప్పుకోవాలి, వెయ్యి క్రాసు పరీక్షలకు తట్టుకుని చివరివరకూ ఆ అపద్దాన్నే అంటిపెట్టుకోగల అతడి నిజాయితీ మెచ్చుకోదగ్గది! కానైతే ఆదిశేషయ్య సాక్ష్యం అపద్ధపు సాక్ష్యానికి పర్యాయపదం కావడంతో మొదట మొదట లాభసాటిగా ప్రారంభమైన ఈ వ్యాపారం నానాటికీ తీసికట్టయిపోయింది.

ఈసారి ఆదిశేషయ్య ఒకరికి తెలియకుండా ఒకరిదగ్గర ఓపినన్ని అప్పులు చేసేశాడు. ఆ అప్పులు వడ్డీలతో కలిసి ఒక నాలుగంకెల పెద్ద సంఖ్యగా రూపొందేసరికి ఓ చిన్న సత్యం బయటపడింది. భూస్థితిలో ఒక్క సెంటుగూడా ఆదిశేషయ్యది గాదు! ముందు జాగ్రత్తతో అతడేనాడో ఆస్తిని భార్యపేరిట వ్రాసి రిజిష్టరు చేసేశాడు.

కానీ ఎప్పుడు లేచినా రాళ్ళవంక దగ్గరే తెల్లవారినట్లు, ఆదిశేషయ్య ఎంత సంపాదించినా, అందులో కొంత పేకాటకు, మరికొంత కోడిపందాలకు, మిగిలింది నిజదార సుతోదరపోషణకు సరిపోయింది. పోగా జవసత్వాలుడిగి వృద్ధాప్యం దగ్గరించేసరికి అతనికి ఎర్రని ఏగానీ లభించని దుర్దశ ప్రాప్తించింది!

సరిగ్గా ఈ పరిస్థితిలోనే ఆదిశేషయ్య విజ్ఞప్తి వ్రాయించుకుని దేశంపైకి బయల్దేరాడు. ఎక్కడెక్కడ తిరిగాడో ఏమిటో రెండుమూడు మాసాలవరకూ అజాపజా లేకుండా పోయాడు.

ఒక పడి బియ్యమనీ, పిడికెడు ఉప్పనీ, గుప్పెడు మిరపకాయలనీ తులసమ్మత్త వూళ్ళో ప్రతి యింటా బాకీలు చేసి పెట్టింది. చీలికలు వాలికలై చింపిరి దుస్తులతో గంగజాతరలో బయల్దేరిన వేషాల్లా అతని బిడ్డలు వీథుల్లో తిరుగుతూ వూళ్లో ఎక్కడబడితే అక్కడ కనిపించారు.

ఓ రోజు వుదయం పళ్ళు తోముకుంటూ చెరువుకట్టదిగి ఊళ్ళోకి వస్తున్నాను. రచ్చపైన ఆదిశేషయ్య హఠాత్తుగా ప్రత్యక్షమయ్యాడు.

మనిషి మునుపటికన్నా చిక్కిపోయాడు. గడ్డం గుబురుగా పెరిగింది. పెదవులు మధ్య కాలుతున్న చుట్టతో గుప్పుగుప్పున పొగ వదులుతూ, నల్లగా మాసిపోయిన దుస్తుల్లో బొగ్గులో మునిగిలేచిన యింజనులా కనిపించాడు.

"ఏం శేషయ్యమామా! ఎప్పుడొచ్చావు?" అన్నాను.

"ఎప్పుడొస్తే నేమిగాని ఈ గడ్డంతో పెద్ద పీడగా వుందిరా పాదు! మంగలి కోసం చూస్తున్నాను" అన్నాడు ఆదిశేషయ్య.

ఏ మాత్రం వసూలయిందని వాకబు చేయాలనుకున్నాను కానీ ఎప్పుడొచ్చావన్న మామూలుప్రశ్నకే సదుత్తరం లేకపోగా యిక ఈ విశేషాన్ని గురించి ప్రస్తావించే చొరవ నాకు లేకపోయింది.

ఆదిశేషయ్య కలిమిలేములతో తనకేమీ సంబంధం లేనట్టు మళ్ళీ కాలచక్రం దొర్లిపోసాగింది. ఒకటి రెండు మాసాలు గడచిపోయాయి. ఈ వ్యవధిలో ఆదిశేషయ్య యింటిల్లుపాదికీ వరుసగా కొత్తబట్టలు కొన్నాడనీ, పది మూటల వడ్లు తీసి మిషనులో దంపించాడనీ రోజు కొకటి రెండు చొప్పున కొత్త కొత్త కబుర్లు నా చెవిలో పడుతూ వచ్చాయి. అయిదారు నెలల పొడుగునా అరగడుపు పరగడుపుగా పస్తులు మాడిన ఆకుటుంబానికి ఈ మాత్రం వెసులుబాటు కలగడం నా మట్టుకు నాకు కాస్తా సంతృప్తినే చేకూర్చింది. కానీ ఈ సంతృప్తికి వెనుక నాలో ధర్మవరం – రాయలపేట బాటసారులపట్ల సానుభూతి లేకపోలేదు! పాపం, వాళ్ళని భగవంతుడు నాటికీ నేటికీ చిన్న చూపే చూచాడు...! తెట్టతేరకు భగవంతుడిపైన నింద వేయకుండా వేరొక విధంగా భావించడం మరీ మంచిదీ! వాళ్ళడిగి వచ్చిన రాత చిన్నది! ఎండలో తల మాడిపోవాలి, కాళ్ళు కాలిపోవాలి, నాలుక పిడచగట్టుక పోవాలి అని అడిగివచ్చిన వాళ్ళకు సత్రాలూ, చేద బావులూ ఎక్కడి నుంచీ లభిస్తాయి?

# 3

ఒకసారి మానవ రక్తానికి మరిగిన తర్వాత పెద్దపులిని ఆ వ్యామోహం ఒక పట్టాన వదలిపెట్టదని చెబుతారు. ఆదిశేషయ్య రెండోసారి విజ్ఞప్తి వ్రాయించుకపోవడానికి వచ్చినప్పుడు నా కా పోలిక జ్ఞప్తికి వచ్చి నిర్విణ్ణుడినై పోయాను.

రెండోసారి ఆదిశేషయ్య తన పథకాన్ని కొంచెం సవరించుకున్నాడు. నిరంకుశుడైన నియంతలా కాకుండా మంచి 'మూడ్'లో వున్న మంత్రిసత్తముడిలా అందుకు కారణాలు కూడా విశదీకరించాడు. "సత్రమూ, చావడీ, గుడీ, గోపురమూ అంటే ఈ రోజుల్లో మనుషులు కదిలీ మెదలడం లేదు! ఉన్న సత్రాలే పాడుబడిపోతుండగా కొత్తవి కావలసివచ్చాయా అంటూ దులపరించుకుని వెళ్తారు. ఇంకా వాళ్ళే నయం! మరి కొందరైతే

'రోడ్డులో బస్సులు పరుగిడుతుండగా వీళ్ళ నెవడు నడిచి చావమన్నాడు' అంటూ మడత పేచీకి సిద్ధమయ్యారు! ఎందుకొచ్చిన గొడవ గానీ నువ్వీ దఫా నేను చెప్పినట్టు వ్రాయరా బాబూ!"

ఎలా వ్రాయమంటాడో చెప్పమన్నాను.

ఆదిశేషయ్య చెప్పాడు.

ఆ మాటలు చెబుతుండగా అతడి ఆకారాన్ని చూస్తూ నోట మాట రాక స్తంభించిపోయాను. పరమేశ్వరుణ్ణి కరుణామయుడని పేర్కొంటారు. ఆ పేర్కొనడంలోని పరమార్థం నా కాక్షణాన తేటతెల్లమైనట్టు మరెన్నడూ కాలేదు. రత్నగర్భ అయిన వసుంధరను, నిండుగా ప్రవహించే జీవనదులను, అంబుదాలను నిలవేసే మహా పర్వతాలనూ ఆయన భూలోకవాసులకు ప్రసాదించాడు. ఇదంతా ఒక ఎత్తయితే, పుట్టగానే నిప్పుతో అవసరం లేకుండా లోకాన్ని కాల్చివేయగల విపరీతమైన తెలివితేటలతో పుట్టినవారికి విద్య, డబ్బు, అధికారం లాంటివి ప్రసాదించకపోవడం ఒక ఎత్తు. ఇది సాధారణంగా కంటికి కనిపించని భగవంతుని కరుణామయత్వం.

ఆదిశేషయ్య ఈ దఫా ఊరు వూరంతా పరశురామ ప్రీతి అయిపోయినట్టు వ్రాసేయమన్నాడు.

ఆ వ్రాయడం గూడా చదివినవాడి గుండె అలాగే కరిగి కన్నీరైపోయేలా వ్రాయమన్నాడు. ఫెడీల్ ఫెడీల్‌మని వెదుళ్ళు ఎలా చిట్లిందీ, గాలి విసురులో మంటలెలా నాలుకలు సాచిందీ, ఆడా మగా, పిన్నా పెద్దా, పిల్లా జెల్లా ఎలా దీనంగా ఆక్రోశించిందీ క్షుణ్ణంగా వర్ణించమన్నాడు. ఇలాంటి దురవస్థలో యిల్లూవాకిలీ, తిండీ, గుడ్డా లేకుండా తల్లడిల్లిపోతున్న గ్రామస్థులకు యథోచితంగా ధనరూపంగానో, ధాన్య రూపంగానో సాయపడడం తోటి మానవుల కనీసపు ధర్మమని నొక్కి వక్కాణించమన్నాడు.

"ఆ మాత్రం రాయకపోతే నాలుగు కాసులు రాలవురా బాబూ! నీకు మరేం భయం లేదులే! నేనీసారి రొంపిచెర్ల దగ్గర నుంచీ మొదలు పెట్టి గొట్టిగిల్లు, బాకరా పేట, నెరబయలు దాకా వెళుతున్నాను. ఆ యిలాకా వాళ్ళకు అసలీ పేరుతో ఒక వూరు వున్నదీ, లేనిదీ తెలియదు! వట్టి బోళాభాయీలనుకో! చిటికెలో నమ్మించవచ్చు వాళ్ళని! నా అవస్థేదో నేను పడతాను గానీ నువ్వు నేను చెప్పినట్లు వ్రాసివ్వు! తొందరపడుతున్నా ననుకోకు! బాగా ఆలోచించి నిదానంగా రాయి."

మరునాటి వుదయం మసక మసక చీకటిలో వీధిమెట్లు దిగుతున్నాను. అరుగుపైన పడుకున్న ఆదిశేషయ్య తటాలున లేచి కూర్చుంటూ "రాసేశావా నాయనా?" అన్నాడు.

"లేదు శేషయ్యమామా! వ్రాయాలనుకోలేదు. నిజానికి నేనావిధంగా వ్రాయలేను" అన్నాను.

"ఏం, ఎందుకు వ్రాయవు?" జీవితంలో గొప్ప ఆశాభంగం పొందిన వాడిలా అడిగాడు ఆదిశేషయ్య.

"చూచి చూచి అలాంటి అబద్ధం వ్రాయడానికి నాకు మనస్కరించదు" అన్నాను.

"పోనీలే, వూరి సంగతి నా కొద్దుగానీ నా యిల్లుమాత్రం కాలిపోయినట్టు రాయి! ఇందుకైతే నీకు మనస్కరిస్తుంది గదా? ఒరే అబ్బీ! కథలూ కారణాలూ వ్రాసి నీకొక మాదిరిగా చేయి తిరిగిందని యిలా ప్రాధేయ పడుతున్నాను. అదేదో గొప్ప పనైనట్టు నువ్వు బిర్ర బిగుసుకుంటున్నావు. ఆ మాట కొస్తే నేనొక టడుగుతాను. కథల్లో నువ్వు వ్రాసేదంతా నిజమేనేమిటి?"

నాకు ఒళ్ళు మండింది. గబగబా యింటి లోపలికి వెళ్ళి వెనుకాముందూ చూడకుండా పది గీతలు గిలికి ఆ కాగితాన్ని తెచ్చి అరుగుపైన పడవేసి "నీకు పదివేల నమస్కారాలు శేషయ్య మామా! ఇక మీదట యిలాంటి విజ్ఞప్తులు వ్రాసిపెట్టమని నన్ను బలవంతం పెట్టకు" అన్నాను.

ఎదుటివాడు నొచ్చుకోడంతోగానీ, మెచ్చుకోడంతోగానీ ప్రమేయం పెట్టుకోని మనిషి ఆదిశేషయ్య! కాగితం చేతిలో పడగానే గబాలున పైకిలేచి తిరిగి చూడకుండా వెళ్ళిపోయాడు.

# 4

ఎవరోగానీ ఒక లోకజ్ఞుడు వంచనాశిల్పాన్ని గురించి నాలుగు మంచి మాటలు చెప్పాడు: "కొందరిని ఎల్లకాలమూ ఏమరించవచ్చు. అందరినీ కొంత కాలం ఏమరించవచ్చు. అందరినీ ఎల్లకాలమూ ఏమరించడం అసాధ్యం."

ఆదిశేషయ్య కొంతకాలంపాటు అందరినీ మోసగించాడు. ఎలా బయట పడిందోగానీ అతని కుతంత్రం బయటపడింది. ఇలాటివాడు కమ్ములకు బయటుండడం లోకానికి ఉపద్రవకరమని భావించి పోలీసులు ఆదిశేషయ్యను తమ కస్టడీలోకి తీసుకున్నారు. ఒకటి రెండు రోజుల్లో ప్రాథమిక చర్యలన్నీ ముగించి లోకుల్ని దగా చేసాడన్న నేరం క్రింద ఎక్కడా ఓటుగానీ బీటగానీ లేకుండా అతడిపైన కేసును రూపొందింపచేశారు.

ఒక తులసమ్మత్త తప్పితే ఈ పరిణామాన్ని గురించి చింతించే నాథుడే లేకపోయాడు. కేసు జరుగుతున్నప్పుడు జామీను నిలిచి అతణ్ణి విడిపించుకునే ఔదార్యం మానవమాత్రుడి కెవడికీ లేకపోయింది! కడకతనికి న్యాయవాదిగానీ, సాక్షులుగానీ లేకపోయారు.

ఎలాగూ నీ యిల్లు కాలిపోయింది. రెండు సంవత్సరాలపాటు ప్రభుత్వం వారికి అతిథిగా వుండి వెళ్ళమన్నాడు న్యాయమూర్తి.

'రెండు సంవత్సరాలంతా ఎంత! కాలచక్రం రెండుసార్లు చుట్టితే చాలు! చూస్తుండగానే రెండేళ్ళు గడచిపోతాయిలె'మ్మని తులసమ్మత్తను ఓదార్చడం నా దినకృత్యాల్లో ఒకటైపోయింది.

జైల్లోకివెళ్ళి కూర్చున్న తర్వాత కూడా ఆదిశేషయ్య నన్ను పీడించడం మానలేదు. అప్పుడతడు స్వయంగా పీడించాడు. ఇప్పుడు భార్య ద్వారా పీడిస్తున్నాడు!

"ఏం చేయమంటావు నాయనా! ముందే అబ్బనాకారపు మనిషి! ఏమైపోయాడో ఏమిటో ఒకటే ఆరాటంగా వుంది. ఆడదాన్ని. పుట్టి బట్టగట్టినప్పటినుంచీ పొరుగూరి ముఖం చూచి ఎరుగనిదాన్ని. ఇప్పుడు కూడా పిల్లల్ని వెంటబెట్టుకుని నేను యిల్లు కదల్లేను. నువ్వయినా వెళ్ళి ఎలా వున్నాడో చూచి రాకపోతే నాకు నిబ్బరం కలుగదు. బాబ్బాబూ, నీ మేలు మరచిపోను. చచ్చి నీ కడుపున బుద్తాను..."

చెవిలో యిల్లుగట్టుకున్న తులసమ్మత్తపోరు పడలేక జైలు అధికారులకొక విన్నపం వ్రాసి పంపుకున్నాను. వాళ్ళూ ఖైదీని కలుసుకోడానికి అనుమతిస్తూ సమయాన్ని నిర్దేశించి నాకు తెలియజేశారు.

# 5

పాపానికి దండన తప్పదు. నేరానికి శిక్ష తప్పదు. పాపానికి దండన యమలోకంలో విధింపబడుతుంది. నేరానికి శిక్ష జైల్లో అమలు జరుగుతుంది. ఖైదీని కలుసుకోవడానికి జైల్లో ప్రవేశిస్తూ కొంచెం ఆత్మవిమర్శన చేసుకోవలసి వచ్చింది. ఆదిశేషయ్య వేషంలో నా పాత్రగూడా ఏ మాత్రమో లేకపోలేదు. అతడి నేరానికి శిక్ష రెండేళ్ళు, నా నేరానికి శిక్ష సరిగ్గా పదిహేను నిమిషాలు!

కమ్మీలకు అటువైపున ఆదిశేషయ్య, ఇటువైపున నేను, దూరంగా చెట్టుక్రింద సాయుధుడైన పోలీసు.

ఆదిశేషయ్య ఎండి ఒరుగైపోయాడు. జానెడు పొడుగు గడ్డంలో అతణ్ణి గుర్తుపట్టడమే దుస్తరమైపోయింది. ఈ వికారస్వరూపం చాలదన్నట్టు అతడికొక పొట్టిషరాయీ, గళ్ళ బనీనూ తగిలించారు. ఈ వేషంలో అతడు 'విధి' అన్న చిత్రకారుడు వేసిన కార్టూను బొమ్మలా కనిపించాడు.

నన్ను చూడగానే ఆదిశేషయ్య కళ్ళల్లో కన్నీరు పెల్లుబికింది. పెదవులు ఎండుటాకులా కంపించాయి, కంఠం గద్గదికమైపోయింది.

"ఊళ్ళో అందరూ బాగున్నారా?" శోకరుద్ధమైన గొంతుకతో అతడు ప్రశ్నించాడు.

"బాగానే వున్నారు శేషయ్యమామా! కానీ నువ్వుమాత్రం ఎముకలగూడైపోయావు. జరిగిందేమో జరిగిపోయింది. అందుకు చింతించి లాభం లేదు. ధైర్యం చిక్కబట్టు కోవాలి. తులసమ్మత్త నిన్ను తలచుకోని క్షణం లేదు. నువ్వామె కళ్ళల్లో మెదులుతున్నావట! బిడ్డలు నీ కోసం బెంగపెట్టుకున్నారని చెప్పమంది" అన్నాను.

ఆదిశేషయ్య కారాగారవాసంలోని క్లేశాలను గురించీ చెప్పుకపోసాగాడు. ఆ తిండినిచూస్తే డోకొస్తుందట! ఆ పని చేయలేక ఎముకలు నుగ్గునూచమైపోయాయట! రాత్రుల్లో దోమలూ, నల్లులు నిద్రపోనీవట! ఆ మధ్య ఒకసారి పది రోజులపాటు జ్వరం ముమ్మరంగా కాసిందట! "చచ్చినా బాగుండేది. మందులిచ్చి మళ్ళీ నన్ను బ్రతికించేశారు" అన్నాడు ఆదిశేషయ్య.

"అదేంమాట శేషయ్యమామా! నువ్వుపోతే బిడ్డలేంగావాలి? తులసమ్మత్తగతేం కావాలి?" అన్నాను.

"నిజమేరా బాబూ నిజమే! వాళ్ళను తలచుకుంటే నా గుండె చెరువైపోతుంది" కాంతారంలాంటి అతడి గడ్డంలో కన్నీటిధారలు కొండవాగుల్లా ప్రవహిస్తున్నాయి.

"టైమైపోతోంది. త్వరగా ముగించండి." బిగ్గరగా అరిచి చెప్పాడు పోలీసు.

"వెళ్ళొస్తాను శేషయ్యమామా!" అన్నాను.

"వెళ్ళొస్తావా? అప్పుడే? ఇదిగో బాబూ! ఉండుండు... ఒకమాట...."

తటపటాయించకుండా చెప్పమన్నాను.

"నాకేదైనా కలవస్తే అది తప్పకుండా పాటింపుకొచ్చేది. మరి ఈ జైల్లో పడినప్పటినుంచీ ఒకే కల...ప్రతిరాత్రీ అదే కల..."

"చెప్పు శేషయ్యమామా! అప్పుడే ఒక నిమిషం ఆలస్యమైపోయింది" అన్నాను.

"ఇల్లు కాలిపోయినట్టు! అసలే నాది పూరికొంప! ఆడదానికి బిడ్డలకూ నిలువనీడగూడా లేకపోయిందేమోనని నా దిగులు."

నేను ఆదిశేషయ్యను ఎగాదిగా చూచాను. ఇతడు పాత ఆదిశేషయ్యగాదు. పాత ఆదిశేషయ్య తనలోని దానవునికి దాసుడై మానవుణ్ణి హతమార్చడానికి సాయశక్తులా ప్రయత్నించాడు. కాని మానవుడు మొండివాడు. భూమిలో దాగొన్న బీజం తడిసోకగానే మొలకెత్తినట్లుగా అతడు అవకాశం దొరకగానే దుమ్ముదులుపుకుని పైకిలేచాడు. ఆదిశేషయ్యలోని దానవుణ్ణి తోసిరాజని ఇలలో కాకపోతేనేమి, కలలోనైనా అతడు తన రాజ్యాన్ని స్థాపించగలిగాడు! అప్పటికీ పరిణామం చాలు! ఎప్పటికైనా మానవుడిదే విజయమని భావించడంలో గల ఆనందం అనుపమానమైంది. అట్టి ఆనందం నాకు మా శేషయ్యమామ జీవిత గాథ ద్వారా లభ్యమైంది!

♦ ఆంధ్ర సచిత్ర వారపత్రిక - 1959 ♦